# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-03-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 17వ తేదీన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్న సభలో భద్రతా వైఫల్యంపై నివేదిక ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.**

**2.** **తెలంగాణలో ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అవకతవకలన్నింటిపై ఆధారాలతో సహా శ్వేతపత్రం విడుదల చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.**

**3.** **ఎన్నికల సంఘం నుంచి స్పష్టత వచ్చిన తర్వాతే ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష.. టెట్ ఫలితాలను వెల్లడిస్తామని రాష్ట్ర విద్యాశాఖ స్పష్టంచేసింది.**

**4.** **ఎన్నికల ప్రవర్తనా నియమావళి సమర్థవంతంగా అమలు చేయడానికి వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు.**

**5.** **'శాంతి కోసం జలం' ఇతివృత్తంతో ఈ రోజు ప్రపంచ జల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 17వ తేదీన భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్న సభలో భద్రతా వైఫల్యంపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నెల 17వ తేదీన చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో భారతీయ జనతా పార్టీ, తెలుగుదేశం, జనసేన కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగళం సభలో నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సభకు బందోబస్తు కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని విపక్షాలు ఆరోపించాయి. సభలో జరిగిన తొక్కిసలాట ఇందుకు నిదర్శనమని పేర్కొన్నాయి. ఈ అంశంపై ఫిర్యాదులు అందడంతో కేంద్ర ఎన్నికల సంఘం స్పందించి.. త్వరగా విచారణ పూర్తిచేసి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఆదేశాలు జారీ చేసింది.

--------------------------

ఆంధ్రప్రదేశ్ సహా మూడు రాష్ట్రాలకు ఎన్నికల ఇన్‌ఛార్జులను, సహ ఇన్‌ఛార్జులను భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం నియమించింది. ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఛార్జిగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్, సహ ఇన్‌ఛార్జిగా ఉత్తర్‌ప్రదేశ్ మాజీ మంత్రి సిద్ధార్థనాథ్ సింగ్ రానున్నారు. రాజస్థాన్ ఇన్‌ఛార్జిగా మాజీ ఎంపీ వినయ్ సహస్రబుద్ధే, కో-ఇన్‌ఛార్జులుగా జాతీయ కార్యదర్శి విజయ్ రాహత్కర్, పశ్చిమ ఢిల్లీ ఎంపీ పర్వేశ్ సాహిబ్‌సింగ్

వర్మ.. హరియాణా ఇన్‌ఛార్జిగా రాజస్థాన్ బీజేపీ సీనియర్ నేత సతీశ్ పూనియా, సహ ఇన్‌ఛార్జిగా ఉత్తర్‌ప్రదేశ్ ఎంపీ సురేంద్రసింగ్ నాగర్‌ను నియమిస్తూ ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా నిన్న ఉత్తర్వులు జారీచేశారు.

---------------------------

తెలంగాణలో ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అవకతవకలన్నింటిపై ఆధారాలతో సహా శ్వేతపత్రం విడుదల చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ధరణిలో ప్రజలకు ఇబ్బంది కలిగించే విషయాలను తొలగించి.. మంచి వాటిని కొనసాగిస్తామని స్పష్టంచేశారు. రిజిస్ట్రేషన్ల శాఖను కూడా సరిదిద్దవలసిన చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. మంచి నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా గిద్దలూరు, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో పల్నాడు జిల్లా మాచర్లలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై సంబంధిత జిల్లాల పోలీస్ సూపరింటెండెంట్లు పరమేశ్వర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, కె.రఘువీరారెడ్డి నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా వివరణ తీసుకున్నారు. ముగ్గురు ఎస్పీలు గురువారం సీఈవో ఎదుట హాజరుకాగా.. ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడి ఘటనలకు సంబంధించిన వివరాలు ఆయన అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో నేరుగా ఎన్నికల సంఘం నిఘా కొనసాగుతోందని ముఖేశ్‌కుమార్ మీనా తెలిపారు. ముగ్గురు ఎస్పీలు ఇచ్చిన వివరణలను ఆయన కేంద్ర ఎన్నికల సంఘానికి పంపనున్నారు.

---------------------------

ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాబ్లింగ్, ప్రజారోగ్యానికి హాని కలిగించే ఉత్పత్తులకు ప్రచారం కల్పించవద్దని సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ నిన్న ఒక ప్రకటన విడుదల చేసింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు ప్రచారం చేసే ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వంటి ప్రకటనలు ప్రజలపై ఆర్థికపరమైన ప్రభావం చూపుతున్నాయని... ముఖ్యంగా యువత వీటికి ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని పేర్కొంది. భారతీయ ప్రేక్షకులు లక్ష్యంగా ప్రసారమయ్యే ఇలాంటి ప్రకటనలను ప్రోత్సహించవద్దని ఇన్‌ఫ్లూయెన్సర్లకు సూచించింది. సామాజిక మాధ్యమ సంస్థలు ఇలాంటి అంశాలు తమ ప్లాట్‌ఫామ్‌లలో ప్రసారం కాకుండా తగు చర్యలు తీసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వాటిని ప్రోత్సహిస్తే వినియోదారుల సంరక్షణ చట్టం-2019 ప్రకారం బాధ్యుల సామాజిక మాధ్యమ ఖాతాలు తొలగించడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర నిఘా సంస్థలు సంయుక్తంగా 'ఆపరేషన్ గరుడ' చేపట్టి సుమారు 25 వేల కిలోల మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాయి. బ్రెజిల్‌లోని శాంటోస్ పోర్టు నుంచి షిప్ కంటైనర్‌లో భారీ పరిమాణంలో మాదక ద్రవ్యాలను విశాఖపట్నం తరలిస్తున్నారన్న సమాచారంతో ఇంటర్‌పోల్ ఢిల్లీలోని సీబీఐ అధికారులను అప్రమత్తం చేసింది. అక్కడ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు విశాఖపట్నంలోని సీబీఐ అధికారులు.. కస్టమ్స్ అధికారుల సహాయంతో మాదక ద్రవ్యాలతో విశాఖ పోర్టుకు చేరుకున్న కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అది ఈ నెల 16వ తేదీన విశాఖ చేరుకుందని గుర్తించారు. ఇందులో అంతర్జాతీయ మాదకద్రవ్యాల ముఠా

ప్రమేయం ఉందని అనుమానిస్తున్నామని, దర్యాప్తులో మరిన్ని వివరాలు సేకరించాల్సి ఉందని సీబీఐ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

ఎన్నికల సంఘం నుంచి స్పష్టత వచ్చిన తర్వాతే ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష.. టెట్ ఫలితాలను వెల్లడిస్తామని విద్యాశాఖ స్పష్టంచేసింది. ఈ మేరకు అధికారిక వెబ్‌సైట్ aptet.apcfss.in లో ప్రకటన చేసింది. కాగా.. టెట్‌లో అర్హత సాధిస్తేనే డీఎస్సీ రాసేందుకు అర్హత, డీఎస్సీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉండటంతో ఈ ఫలితాలు ఎంతో కీలకంగా మారాయి. షెడ్యూల్ ప్రకారం మార్చి 14వ తేదీనే టెట్ ఫలితాలు వెల్లడి కావాల్సిఉంది. మార్చి 16వ తేదీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఇప్పుడు ఫలితాల విడుదలకు ఎన్నికల సంఘం నుంచి స్పష్టత అవసరమని అధికారులు పేర్కొంటున్నారు.

---------------------------

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి సమర్థవంతంగా అమలు చేయడానికి వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై సచివాలయంలో నిన్న ఆమె ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో పనిచేసిన విధంగానే.. అదే స్ఫూర్తితో రాబోయే లోక్‌సభ ఎన్నికల నిర్వహణలోనూ మరింత సమర్థవంతంగా పని చేయాలని కోరారు. సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ప్రత్యేకంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు.. ఆయా రాష్ట్రాల చెక్ పోస్టులతో కలసి సమన్వయంతో పటిష్ట నిఘాను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల నిర్వహణ, ప్రవర్తనా నియమావళి అమలుపై అన్ని ప్రధాన శాఖల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని శాంతికుమారి వెల్లడించారు.

---------------------------

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్‌కల్యాణ్ హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు పార్టీల తరఫున పోటీచేసే పార్లమెంటు, శాసనసభ అభ్యర్థుల ఎంపికపై వారు చర్చించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన ఉమ్మడి ప్రచార వ్యూహంపై నేతలిద్దరూ నిన్న సుమారు గంటపాటు చర్చించారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ 128 శాసనసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. మరో 16 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించవలసి ఉంది. 17 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. కాగా.. చంద్రబాబు నాయుడు ఈ నెల 26వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారు. 27వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించేలా పవన్‌కల్యాణ్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

---------------------------

ఈ రోజు ప్రపంచ జల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. నీరే జీవనం. మానవ మనుగడకు నీటి ఆవశ్యకతను తెలియజెప్పి, పరిమిత వనరుగా ఉన్న నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలనే అవగాహన ప్రజల్లో కల్పించే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి 1993 నుంచి ప్రతీ ఏటా మార్చి 22వ తేదీన ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

పర్యావరణ పరిరక్షణతోనే నీటి వనరుల పెంపుదల సాధ్యమని చాటిచెబుతూ 'శాంతి కోసం

జలం' ఇతివృత్తంతో ఈ సంవత్సరం జల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. భావితరాలు నీటి కొరతను ఎదుర్కోకుండా నదులను సంరక్షించాలని ఈ సందర్భంగా అవగాహన కల్పిస్తూ పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

---------------------------

పాత పింఛన్ పథకం.. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ప్రభుత్వ, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు మే 1వ తేదీ నుంచి ప్రకటించిన నిరవధిక సమ్మెను వాయిదా వేశారు. కేంద్ర మంత్రివర్గ కార్యదర్శి రాజీవ్ గౌబ, కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ సహా ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నామని ది జాయింట్ ఫోరం ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్.. జేఎఫ్ఆర్‌వోపీఎస్ నిన్న వెల్లడించింది.

---------------------------

కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశిస్తే ఆంధ్రప్రదేశ్‌లోని కడప లోక్‌సభ స్థానంతో పాటు ఎక్కడి నుంచైనా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ తరఫున పోటీచేయడానికి 1,500కు పైగా దరఖాస్తులు వచ్చాయని, అవన్నీ పరిశీలనలోనే ఉన్నాయని, ఇంకా ఏదీ ఖరారు కాలేదని, విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో నిన్న జరిగిన వైఎస్ఆర్ జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె వెల్లడించారు.

======================